అభయహస్తానికి దరఖాస్తుల వెల్లువ


మోమిన్‌పేట: గోవిందాపూర్‌లో క్యూలో నిల్చున్న మహిళలు


ధారూరు: గట్టెపల్లి గ్రామసభలో దరఖాస్తుదారునికి రసీదు అందజేస్తున్న సీఈఓ జానకీరెడ్డి

ప్రజాపాలనకు విశేష స్పందన

- రెండోరోజూ బారులు తీరిన జనం
- పరిశీలించి, తప్పులు సరిదిద్ది అర్జీలను స్వీకరించాలి
- నిర్వాహకులకు ఉన్నతాధికారుల సూచన

ధారూరు: ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలకోసం ప్రజలు అందజేస్తున్న అర్జీల్లో పొరపాట్లు లేకుండా చూడాల్సిన బాధ్యత మీ పైనే ఉందని జిల్లా పరిషత్ సీఈఓ జానకీరెడ్డి అధికారులను ఉద్దేశించి అన్నారు. ధారూరు మండలం గట్టెపల్లి గ్రామంలో రెండో రోజు శుక్రవారం జరిగిన ప్రజాపాలన గ్రామసభలో ఆమె ప్రజల నుంచి పలు దరఖాస్తులను స్వీకరించి, రసీదు అందజేశారు. అనంతరం మాట్లాడారు. గ్రామాలు, తండాల్లో నిరక్షరాస్యులు ఉంటారని, వారి దరఖాస్తుల్లో తప్పులు దొర్లే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వాటిని పరిశీలించి తప్పులు ఉంటే సరిచేసి తీసుకోవాలని సూచించారు. దూర ప్రాంతాల్లో ఉన్న వారు మీమీ దరఖాస్తులను గ్రామ సభల్లో కాకుండా, తర్వాత గ్రామ కార్యదర్శికి ఇవ్వవచ్చని సీఈఓ ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి, సర్పంచ్ జానకీబాయి, ఇన్‌చార్జి ఎంపీడీఓ చెన్నారెడ్డి, ఎంఈఓ బాబుసింగ్, ఏఓ ఝాన్సిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ తీసుకుంటున్న వారు వద్దు

ఆరు గ్యారంటీల కోసం ప్రతి కుటుంబం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ జె.విజయలక్ష్మి అన్నారు. ధారూరు మండల పరిధి రాంపూర్‌తండాల్లో నిర్వహించిన ప్రజాపాలనను ఆమె పరిశీలించి మాట్లాడారు. ఉపాధి కోసం వెళ్లిన వారు, దూరప్రాంతాల్లో ఉన్న వారు దరఖాస్తు అందజేయకున్నా.. తర్వాత గ్రామ కార్యదర్శులకు ఇవ్వవచ్చని సూచించారు. పింఛను తీసుకుంటున్న వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని చెప్పారు. కార్యక్రమంలో మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బసప్ప, సర్పంచ్ పాండునాయక్, ఇన్‌చార్జి ఎంపీడీఓ చెన్నారెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అందరి నుంచి స్వీకరించాలి

మోమిన్‌పేట: అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులను స్వీకరించాలని ఆర్డీఓ విజయకుమారి అధికారులను ఆదేశించారు. మండల పరిధి అంరాధికలాన్ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలనను ఆమె సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకునే ప్రతి ఒక్కరి నుంచి అర్జీలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి చరితరెడ్డి, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఎంపీడీఓ శైలజారెడ్డి, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.


తాండూరు రూరల్: నారాయణపూర్‌లో .. తహసీల్దార్ తారాసింగ్


పెద్దేముల్: దుగ్గాపూర్‌లో..


బొంరాస్‌పేట: హంసాన్‌పల్లిలో..


బొంరాస్‌పేటలో..

అర్జీల వెల్లువ

దౌల్తాబాద్: ప్రజాపాలనకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. మండల పరిధి దేశాయిపల్లి, యాంకి, అల్లాపూర్, గుముడాల, గుండేపల్లి, కుప్పగిరి గ్రామాల్లో ప్రజలు అధికారులకు దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తిరుమలస్వామి, తహసీల్దారు విజయ్‌కుమార్, ఎంపీఓ రవీందర్, ఏపీఎం సాయన్న, ఏపీఓ రజనీకాంత్ ఉన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

తాండూరు రూరల్: ప్రజాపాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ తారాసింగ్ అన్నారు. మండల పరిధి నారాయణపూర్, వీరశెట్టిపల్లిలో నిర్వహించిన గ్రామసభలను ఆయన సందర్శించి మాట్లాడారు. సంక్షేమ పథకాలకు అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రప్ప, పంచాయతీ కార్యదర్శి సత్యానారాయణరెడ్డి, వివేకానంద సంఘం అధ్యక్షుడు ఉప్పరి రాజు పాల్గొన్నారు.

3,272 దరఖాస్తులు

పెద్దేముల్: ప్రజాపాలనకు విశేష స్పందన వస్తోంది. రెండో రోజులు కొనసాగిన కార్యక్రమాల్లో మొత్తం 3,272 దరఖాస్తులను స్వీకరించినట్లు ఎంపీడీఓ లక్ష్మప్ప, తహసీల్దార్ కిషన్‌లు తెలిపారు. మొదటి రోజు చైతన్యనగర్, ఖాజాపూర్, గొట్లపల్లి, కందనెల్లితండా, మంబాపూర్, కందనెల్లిలో 1,819 అర్జీలు వచ్చాయని, శుక్రవారం మారేపల్లితండా, దుగ్గాపూర్, కొండాపూర్, జనగాం, మసంతపూర్, మన్‌సాన్‌పల్లిలో 1,453 అర్జీలు స్వీకరించినట్లు పేర్కొ న్నారు.

బొంరాస్‌పేటలో 1,074..

బొంరాస్‌పేట: ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల కోసం ప్రజల నుంచి అర్జీలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి బొంరాస్‌పేట మండలం పరిధి గ్రామసభల్లో కొనసాగుతున్న ప్రజాపాలన సభల్లో డీఆర్‌డీఓ పీడీ కృష్ణన్, ప్రత్యేకాధికారి (ల్యాండ్ రికార్డు విభాగం ఏడీ) రాంరెడ్డి పాల్గొని పరిశీలించారు. దుద్యాల తహసీల్దారు దానయ్య, డిప్యూటీ తహసీల్దారు రవిల ఆధ్వర్యంలో హంసాన్‌పల్లి 118, ఎక్కచెర్వుతండా 177 దరఖాస్తులు వచ్చాయి. మండలంలో తహసీల్దారు వెంకటేష్, ఎంపీడీఓ వెంకన్‌గౌడ్, టీమ్‌లీడర్లుగా ఉండి గట్టిగానితండా 179, కుబ్యానాయక్‌తండా 138, సూర్యానాయక్‌తండా132, జానకంపల్లి 101, బాపల్లి 170, మేడిచెట్టుతండా 59 అర్జీలు అందగా.. ఉమ్మడి మండలంలో మొత్తం 1,074 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

దగ్గరుండి ఫారాలను నింపండి

అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ


ఫారాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

పూడూరు: ప్రభుత్వ పథకాలైన ఆరు గ్యారంటీల కోసం అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ సూచించారు. మండల పరిధి మిట్టకంకల్, ఎన్కేపల్లి, కడుమూరు, కండ్లపల్లిలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సుధారాణితో కలిసి దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. దరఖాస్తు చేసేందుకు వచ్చిన వారిని ఇబ్బందులకు గురిచేయరాదని, దగ్గరుండి ఫారాలను నింపాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు భేరి రాంచందర్ యాదవ్, సర్పంచ్ శ్యాంకుమార్, ఎంపీటీసీ సభ్యుడు సురేందర్, మాజీ సర్పంచ్ రాములు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్

కొడంగల్ రూరల్: అన్ని వర్గాలకు సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధి 3వ వార్డు పాతకొడంగల్, పాతకొడంగల్ తండాల్లో, మండల పరిధి అప్పాయిపల్లి, ఉడిమేశ్వరం, పర్సాపూర్, పల్లురాళ్ల తండాల్లో రెండోరోజైన శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలనలో ఇరువురు పాల్గొని, ప్రజల నుంచి పలు దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం మాట్లాడారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా అధికారులు అందరి నుంచి దరఖాస్తులను తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.విజయకుమార్, ఎంపీఓ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్, ఏఈ రాకేష్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


అప్పాయిపల్లిలో అర్జీలను స్వీకరిస్తున్న ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, అధికారులు

సామాజిక తనిఖీలను క్షుణ్ణంగా చేపట్టాలి

ఇన్‌చార్జి ఎంపీడీఓ చెన్నారెడ్డి

ధారూరు: 14వ విడత ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీలను ఆడిట్ సిబ్బంది క్షుణ్ణంగా చేపట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ చెన్నారెడ్డి అన్నారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సామాజిక తనిఖీ కోఆర్డినేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి నుంచి జనవరి 10 వరకు మూడు విడతలుగా సామాజిక సోదాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఒక్కో విడతలో 8 జీపీలు ఉంటాయన్నారు. జనవరి 10న మండల స్థాయిలో ప్రజా వేదిక ఏర్పాటు చేసి, తనిఖీల వివరాలను వెల్లడిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఏపీఓ సురేష్, ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చలాన్లు కట్టండి.. రాయితీలు పొందండి


వాహనదారుల నుంచి చలాన్లు వసూలు చేస్తున్న ఎస్‌ఐ

పెద్దేముల్: చలాన్లు కట్టి, రాయితీ పొందాలని ఎస్‌ఐ కాశీనాథ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలో వాహనాలను తనిఖీ చేశారు. పలువురు వాహనదారుల నుంచి చలాన్లు వసూలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. భారీ రాయితీతో చలానాలు కట్టేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ఈ నెల 26 నుంచి జనవరి10వ తేదీ లోగా దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లేని ఎడలా స్పేషల్ డ్రైవ్ ద్వారా వాహనాలను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు.

అభివృద్ధికి సహకరించండి..


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గ్రామస్తులు

యాలాల: గ్రామాభివృద్ధికి అధిక నిధులు కేటాయించి సహకరించాలని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిని కాంగ్రెస్ అగ్గనూరు నాయకులు కోరారు. శుక్రవారం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేజర్ పంచాయతీకి అధిక నిధులు కేటాయించాలని నాయకులు కోరగా.. గ్రామాభివృద్ధికి ప్రత్యేక దృష్టిసారిస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గరివప్ప, వార్డు సభ్యుడు వీరేశం, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు నరేందర్, వెంకటయ్య, అక్కంపల్లి శేఖర్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

నేడు నాటక ప్రదర్శన

వికారాబాద్ అర్బన్: రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రపై శనివారం సాయంత్రం 5 గంటలకు నాటకం ప్రదర్శించనున్నారు. ఈ మేరకు స్థానిక అంబేడ్కర్ భవనంలో అభ్యుదయ కళాబృందం హైదరాబాద్ వారి చేత సంఘం శరణం గచ్చామి అనే నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజలు, అధికారులు, నాయకులు, అభిమానులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

నేటి నుంచి మల్లికార్జున జాతర

మోమిన్‌పేట: శనివారం రాత్రి నుంచి జనవరి 2వ తేదీ వరకు శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర నిర్వహించనున్నట్లు మండల పరిధి చక్రంపల్లి గ్రామస్తులు తెలిపారు. నేటి రాత్రి 9 గంటలకు స్వామి వారికి పల్లకీ సేవ ఉంటుందని పేర్కొన్నారు. 31న అభిషేకం, ధ్వజారోహణం, పుణ్యావచనం, స్వామి వారి కల్యాణం, అగ్నిగుండ ప్రవేశం అనంతరం అన్నదానం ఉంటుందని వెల్లడించారు. 1న పాలు పట్టుట, గండ జ్యోతుల వెలిగించుట, బండ్ల ఊరేగింపు, స్వామి వారికి బోనాలు, 2న మల్లన్న నాగవెల్లి, ఎల్లమ్మ బోనాలు ఉంటాయని వివరించారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

రాములోరి అక్షింతలకు స్వాగతం


ఆటపాటలతో అక్షింతలకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

కుల్కచర్ల: అయోధ్య రాముల వారి అక్షింతలకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య ఆధ్వర్యంలో అక్షింతలను గురువారం రాత్రి ఘనపూర్ గ్రామానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆటపాటలతో.. జయజయ రామ శ్రీరామ అంటూ రామనామంతో గ్రామం మార్మోగింది.

'పది'లో మెరుగైన ఫలితాలు రాబట్టాలి

ఏంఈఓ హరిశ్చందర్


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

దోమ: పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం దోమ మండలం మోత్కూర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించి, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అల్పాహార కార్యక్రమంతో పాటు మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పరీక్షలను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోనే మెరుగైన ఫలితాలను తీసుకువచ్చేందుకు కృషి చేయాలని కోరారు. పాఠశాల ఉపాధ్యాయులు, సీఆర్‌పీ సతీశ్ పాల్గొన్నారు.

రగ్గుల పంపిణీ

మర్పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు దాతల సహాయంతో రగ్గులు (దుప్పట్లు) పంపిణీ చేస్తున్నామని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ప్రేమ్‌కుమార్ గౌడ్ తెలిపారు. శుక్రవారం మండల పరిధి బూచన్‌పల్లి ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన సాత రాఘవేందర్, ఆయన స్నేహితుడు అభినయ్ దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరవింద్, శ్రీనివాస్ రావు, విజయ్‌కుమార్, పుష్ప కుమారి తదితరులు ఉన్నారు.

సర్పంచ్‌కు సన్మానం


శంకర్‌ను సన్మానిస్తున్న సర్పంచులు

కుల్కచర్ల: సర్పంచ్‌గా సామాజిక కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను వరల్డ్ హ్యూమన్ రైట్స్ సంస్థ నుంచి డాక్టరేట్ పొందిన దాస్యనాయక్ తండా సర్పంచ్ శంకర్ నాయక్‌ను సర్పంచుల సంఘం ఘనంగా సన్మానించింది. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం అనంతరం ఆయన్ను సన్మానించారు. ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, సర్పంచులు సొమ్యారెడ్డి, మఠం ప్రమీల, విజయలక్ష్మి, లక్ష్మి, అనురాధ, వెంకటమ్మ, సంగీత, చందన పాల్గొన్నారు.

క్షణిక నిర్ణయాలతో జీవితం అంధకారం

- తల్లిదండ్రుల మాటకు విలువ ఇవ్వండి
- మోటివేషనల్ స్పీకర్ సేవక్ కుమార్

కుల్కచర్ల: క్షణికావేశంతో తీసుకున్న నిర్ణయాలు జీవితాన్ని అంధకారం చేస్తాయని, లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని మోటివేషనల్ స్పీకర్ సేవక్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో పాఠశాల ప్రత్యేకాధికారి దేవి ఆధ్వర్యంలో మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు సాగడం, జీవితంలో తల్లిదండ్రులు, గురువుల పాత్ర, ప్రేమ వివాహాలు, ఆత్మహత్యలు వంటి అంశాలపై విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సేవక్ మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న మంచిచెడులను గ్రహించి, ఏది మంచో చెడో తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. క్షణిక సంతోషాలు కలిగించే వాటికి లోనుకాకుండా, దీర్ఘకాలికంగా ఉండే ప్రభావిత అంశాల గురించి ఆలోచించాలని చెప్పారు. ప్రేమ అంటూ తిరిగితే జీవితం కోల్పోవాల్సి వస్తుందని, తల్లిదండ్రుల మాటలకు విలువ ఇవ్వాలని సూచించారు. దృఢసంకల్పంతో లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని చదువుకోవాలని, అప్పుడే లక్ష్యాలను సాధించ గలుగుతారని వివరించారు.


విద్యార్థులకు సూచనలు చేస్తున్న సేవక్ కుమార్

సద్వినియోగం చేసుకోవాలి

అనంతగిరి: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న పథకాలకు అర్హులైన వారంతా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ చంద్రకళ అన్నారు. శుక్రవారం వికారాబాద్ మండలం నారాయణపూర్, పెండ్లిమడుగు గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. ఒకే ఫారంలో పలు రకాల స్కీంలకు సంబంధించిన అంశాలు ఉన్నాయనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. ఆర్డీఓ విజయకుమారి మాట్లాడుతూ దరఖాస్తు ఫారంలో ఆయా పథకాలకు అర్హులైన వాటిని చూసి పూరించాలని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. పెండ్లిమడుగులో జరిగిన ప్రజాపాలనను అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ తనిఖీ చేశారు. పెండ్లిమడుగులో 187, నారాయణపూర్‌లో 301, రాళ్ల చిట్టంపల్లిలో 324, ద్యాచారం 187 దరఖాస్తులు వచ్చాయి. ఈ రెండు రోజుల్లో ఆయా గ్రామాల్లో మొత్తం 1,943 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుభాషిణి, ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ, ఐకేపీ, పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పడిపూజ

కొడంగల్ రూరల్: స్థానిక సన్‌సిటీ కాలనీలో నారికేళ (18వ పర్యాయం) గురుస్వామి తలారి గోపాల్ ఆధ్వర్యంలో శుక్రవారం అయ్యప్ప పడిపూజను వైభవంగా నిర్వహించారు. గురుస్వాములు సాయిలు, బాలేశ్వర్, ఉమాపతి, విజయకుమార్, రాజు, మధుస్వాముల ఆధ్వర్యంలో పూజారి జగదీష్ సమక్షంలో ప్రత్యేక పూజలను జరిపారు. ఈ సందర్భంగా గురు స్వాములు స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


పూజా కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు

అతివలు ఆర్థిక పురోగతి సాధించాలి

ఎస్‌బీఐ లీడ్‌బ్యాంకు మేనేజర్ రాంబాబు

ధారూరు: మహిళలు ఆర్థిక పురోగతిని సాధించాలని ఎస్‌బీఐ జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ రాంబాబు అన్నారు. నాబార్డు సహకారంతో సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులకు 10 రోజుల పాటు ఇవ్వనున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. శిక్షణలో జీవనోపాధి మెరుగు, చిరు ధాన్యాల సాగు పద్ధతులు, ఆహార శుద్ధి, సాంకేతిక అంశాలపై మేనేజర్ వివరించారు. అనంతరం మాట్లాడారు. శిక్షణలో అర్హులైన వారికి బ్యాంకుల నుంచి రుణ సదుపాయం కల్పించడంలో బాధ్యత తీసుకుంటామన్నారు. సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమలను నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం ద్వారా అనేక స్కీములు ఉన్నాయని వివరించారు. సంస్థ సీఈఓ నాగబ్రహ్మచారి మాట్లాడుతూ.. చిరు ధాన్యాల విలువకు ఆధారిత జోడింపు పద్ధతుల్లో నైపుణ్యం సాధించాలని సూచించారు. నాబార్డు సహకారంతో సంస్థ చిరు ధాన్యాల ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పుతామని చెప్పారు. దీని ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఫుడ్ టెక్నాలజిస్ట్ రిసోర్స్ పర్సన్ ఆర్తీ తిలక్ మాట్లాడుతూ మిల్లెట్‌లో ఆహార సాంకేతికత కొరత, మహిళలు, యువత ఆహారశుద్ధి సాంకేతిక పరిజ్ఞానం నేర్చుకుంటే స్వశక్తితో ఎదుగుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రోగ్రాం మేనేజర్ రవికుమార్, వికారాబాద్ రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ వాల్యా, మహిళ సంఘం లీడర్ కుమ్మరి అంజలి, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌బీఐ మేనేజర్ రాంబాబు

నిరుపేదలకు అండగా ప్రభుత్వం

నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి

బొంరాస్‌పేట: నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తూ.. అండగా నిలుస్తోందని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం బొంరాస్‌పేట, కొడంగల్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.6.75లక్షల చెక్కులు ఆయన అందజేశారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాలిండాపూర్ పంచాయతీ పరిధి భోజ్యానాయక్ తండాకు చెందిన ఆశాపవార్‌కు రూ.3లక్షలు, కొడంగల్ మండలం పర్సాపూర్ పంచాయతీ పలుగురాళ్ల తండాకు చెందిన కిషన్‌నాయక్‌కు రూ.3.75లక్షలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు.

చలికాలం.. జీవాలు పదిలం!

- వ్యాధుల బారిన మూగజీవులు
- జాగ్రత్తలు తీసుకోకపోతే తీరని నష్టం
- పీపీఆర్ వ్యాక్సిన్‌తో నివారణకు చర్యలు

దోమ: మానవ మనుగడకు ప్రకృతి సంపదతో పాటు పశుసంపద చాలా ముఖ్యం. ప్రత్యక్షంగా, పరోక్షంగా మూగజీవాలు ఎన్నో విధాలుగా మేలు చేకూరుస్తాయి. కాలానికి అనుగుణంగా ఆరోగ్యంపై మనుషులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారో.. పశువులపై అలాంటి జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుత వాతావరణం నేపథ్యంలో పశుసంపదకు తుమ్ములు రావడం, కళ్లు, ముక్కు నుంచి నీరు కారడం లాంటి తదితర లక్షణాలు కనిపిస్తుంటాయి. శ్వాస కోశ ఇబ్బందులు ఎదురవుతాయి. పశువులు వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండటంతో పాటు, వైద్యుల సూచనలు పాటించాలని పశువైద్యాధికారులు స్పష్టం చేస్తున్నారు.

పది రోజుల్లోనే మృత్యువాత

మండలం పరిధి రైతులకు 11,850 పశువులు, 9,964 గేదెలు, 26,312 గొర్రెలు, 17,163 మేకలు ఉన్నాయి. చలి తీవ్రత వలన వీటికి ఎక్కువగా గాలి కుంటూ, ఫుట్‌రాట్, నియోనియా, చిటుకు, పీపీఆర్ వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. ఈ రోగాలకు పలు రకాల బ్యాక్టీరియాలు, వైరస్‌లు, పరాన్న జీవులు కారణం అవుతుంటాయి. దీంతో వాటికి తీవ్రంగా జ్వరం రావడంతో పాటు శ్వాస పీల్చుకోకపోవటం, ఎగశ్వాస రావడం, ముక్కు నుంచి నీరు, చీమిడి కారడం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలతో నీరసించిపోతాయి. కళ్లు ఎర్రబడటం, వీపు భాగం వంగి ఉండటం, తల, మెడ ముందుకు సాగినట్లు కనిపించడంతో పాటు ముక్కు రంధ్రాలు వెడల్పుగా అవుతుంటాయి. త్వరగా చికిత్స చేయించకపోతే ఊపిరితిత్తులు వాచి, వాటికి చీము పట్టే ప్రమాదం ఉంటుంది. దీంతో జీవాలు వారం నుంచి పది రోజుల వ్యవధిలో మృత్యువాత పడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.


పోతిరెడ్డిపల్లిలో జీవాలకు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్య సిబ్బంది

జాగ్రత్తలు తప్పనిసరి..

వ్యాధుల నివారణకు పెంపకం దారులు, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పశువులు, జీవాలకు గాలి, వెలుతురు సరిగ్గా వచ్చే విధంగా చూడాలి. వాతావరణం అనుకూలంగా లేనప్పుడు జీవాలను బయటకు వదలకూడదు. పాకలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి. పీపీఆర్(పెస్టిసైడెస్ పెటిస్ రుమెనేటిస్) అనే టీకా వేయిస్తే.. మూగజీవాలను రోగాల బారిన పడకుండా తప్పించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



పశుసంపద చలి బారి నపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. జీవాల విషయంలో ఎక్కువగా శ్రద్ధ చూపాలి. పీపీఆర్ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. ఈ వైరస్‌తో మేకలు, గొర్రెలు జ్వరంతో బాధపడుతూ.. నీరసంగా ఉంటాయి. మూతికి పుండ్లు, పెదవులు, నోటిలోపల పొక్కులు ఏర్పడి మేత తీసుకోవు. తద్వారా 90 శాతం జీవాలు మృతి చెందే ప్రమాదం లేకపోలేదు. అప్రమత్తంగా ఉంటూ.. ఎప్పటికప్పుడు పశువైద్యులను సంప్రదించాలి.

– ఆనంద్, పశువైద్యాధికారి, దోమ